అడుగడుగునా గోతులే..


గుంతల రోడ్డుపై ప్రయాణానికి వ్యాన్ డ్రైవర్ అవస్థలు


రోడ్డుపై దర్శనమిస్తున్న గోతులు

- ఆ రోడ్డులో ప్రయాణం నరకమే...
- ఎస్వీ జనరల్ మార్కెట్ నుంచి హండ్రెడ్ ఫీట్ రోడ్డు దుస్థితి
- అవస్థలు పడుతున్న వాహన చోదకులు


ఎస్వీ జనరల్ మార్కెట్ నుంచి హండ్రెడ్ ఫీట్ రోడ్డుకు వెళ్లే రహదారి దుస్థితి

రాజమహేంద్రవరం రూరల్: నిత్యం వందల మంది ఆ రోడ్డులో రాకపోకలు సాగిస్తారు. కానీ అడుగడుగునా గోతులు ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగటి సమయంలో గోతులను తప్పించుకుంటూ వెళుతున్నప్పటికీ రాత్రి సమయంలో మాత్రం లైట్లు లేక గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. అయినా ఆ రోడ్డు అభివృద్ధికి పాలకులు చర్యలు తీసుకోవడం లేదు.

వివరాలు ఇవీ..

రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఎస్వీ జనరల్ మార్కెట్ ఉంది. ఆ మార్కెట్‌కు ప్రతి రోజూ అనేక మంది రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ఎస్వీ జనరల్ మార్కెట్ పక్క నుంచి హండ్రెడ్ ఫీట్ రోడ్డును కలుపుతూ ఒక రహదారి ఉంది. ఆ రోడ్డులో నుంచి రూరల్ పరిసర గ్రామాల ప్రజలు ఈ రోడ్డు మీదుగానే మార్కెట్‌కు, నగరంలోకి వెళుతుంటారు.

రోడ్డు పనులకు బ్రేక్

ఎస్వీ జనరల్ మార్కెట్ నిర్మాణ సమయంలో ఈ రోడ్డు పిడింగొయ్యి గ్రామ పంచాయతీ పరిధిలో వచ్చినప్పటికీ నగరపాలకసంస్థ అధికారులు నిర్మించేలా రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అప్పటి కమిషనర్ దినేష్ కుమార్‌కు విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు. అయితే ఆ రోడ్డులో స్థలం కోల్పోయిన కొందరు భూ యజమానులు టీడీఆర్‌ల కోసం కోర్టును ఆశ్రయించడం రోడ్డు పనులకు బ్రేక్ పడింది. అయితే ఒక పక్క హండ్రెడ్ ఫీట్ రోడ్డు నిర్మాణం పూర్తయి ప్రస్తుతం వినియోగిస్తుండడంతో ఈ రోడ్డులోనే అధిక సంఖ్యలో వాహన చోదకులు రాకపోకలు సాగిస్తున్నారు.

ప్రయాణమంటే భయమే..

ఎస్వీ జనరల్ మార్కెట్‌కు వివిధ రకాల వస్తువులను లారీలు తీసుకువెళుతుంటాయి. వాటి రాకపోకలకూ ఈ రోడ్డే ఆధారం. చాలామంది ప్రజలు కూడా ఈ రోడ్డులో నివసిస్తున్నారు. ఇక్కడ ఉన్న యశోద టవర్స్‌లో ఉన్న ప్రజలు పీజీఆర్ఎస్‌లో సైతం రోడ్డు నిర్మాణం విషయంపై ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం నగరపాలకసంస్థ అధికారులు ఈ రోడ్డు రూరల్ పరిధిలోకి రావడంతో రోడ్డు నిర్మాణం నిమిత్తం రుడాకు సిఫారసు చేసినట్టు చెబుతున్నారు. గోతులతో అధ్వానంగా మారిన ఈ రోడ్డులో ప్రయాణించాలంటే భయపడుతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఈ రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించి త్వరితగతిన వేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధ్వానంగా రహదారి



ఎస్వీ జనరల్ మార్కెట్ నుంచి హండ్రెడ్ ఫీట్ రోడ్డుకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. అడుగడుగునా గోతులతో దర్శనమిస్తోంది. దీనివల్ల వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూ యజమానుల టీడీఆర్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– మద్దాల రవిశంకర్, జనరల్ సెక్రటరీ, ఎస్వీ జనరల్ మార్కెట్, రాజమండ్రి

ఉత్సాహంగా సిందూర్ విజయోత్సవం


ర్యాలీలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇన్నీసుపేట శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయం నుంచి డీలక్స్ సెంటర్ వరకూ ర్యాలీ చేశారు. భారతమాత వేషధారణలో జాతీయ జెండా చేతబట్టిన చిన్నారులు దేశభక్తి గీతాలు పాడుతూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తెంటు సత్యనారాయణ, మతల రమేష్, చలుమూరి సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజల అభిప్రాయంతోనే ఇసుక ర్యాంపు


ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడుతున్న అధికారి

సీతానగరం: ప్రజల అభిప్రాయంతోనే నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణ నాయక్ తెలిపారు. శనివారం ములకల్లంక గ్రామ సచివాలయం వద్ద నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభలో ఆర్డీవో కృష్ణ నాయక్‌తో పాటు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి శంకర్, మైన్స్ ఏజీ విష్ణుష్, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ములకల్లంక రెవెన్యూకు చెందిన సర్వే నెంబర్ 46/1డి, 46/1ఎఫ్ లో 2.003 హెక్టార్లు భూమిలో 60.090 క్యూబిక్ మీటర్లలో ఇసుక తవ్వకాలుజరుగుతాయన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో తవ్విన ఇసుక కాటవరం ర్యాంపు నుంచి రవాణా అవుతుందన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి శంకర్ మాట్లాడుతూ ఇసుక తవ్వకాలపై గ్రామ ప్రజల ఏకాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. స్థానికులు మాట్లాడుతూ ఇసుక తవ్వకాల వల్ల గ్రామం వైపు గోదావరి వరద నీరు వేగంగా వస్తోందని, ఇదే కొనసాగితే కొంత కాలానికి గ్రామం కనుమరుగు అవుతుందన్నారు. ఇప్పటికే ధనికులు వేరే గ్రామానికి వెళ్లిపోయారని, ఇళ్ల స్థలాలు లేక పేదలందరం ఇక్కడే ఉంటున్నామన్నారు. అధికారులు తమకు బొబ్బిల్లంకలో ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మైన్స్ ఏడీ ఫణిభూషన్, డివిజన్ సర్వే డీఐవోఎస్ కృష్ణ, పర్యావరణాధికారి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలి

కోరుకొండ: ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలని కోరుకొండ ఎంపీటీసీ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ, పేదల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు జరపకుండా తాత్సారం చేయడం సమంజసం కాదన్నారు. ఇంటింటికీ రేషన్ పంపిణీ వాహనం వెళ్లడం వల్ల వృద్ధులు, వికలాంగులకు ప్రయోజకం కలిగేదన్నారు. ఆ వాహనాలను నిలిపివేయడం వల్ల దానిలో పని చేస్తున్న ఆపరేటర్లు, హెల్పర్లు నిరుద్యోగులవుతారన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు


వంగలపూడి ర్యాంపులో రాత్రి సమయంలో ఇసుక లారీని అడ్డుకున్న శివ కుమార్ తదితరులు

సీతానగరం: మండలంలోని వంగలపూడి, సింగవరం ఇసుక ర్యాంపుల నుంచి అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని మాజీ సైనికుడు, న్యాయవాది సూరెడ్డి శివకుమార్ అధికారులను నిలదీశారు. శనివారం వంగలపూడి, సింగవరం ర్యాంపుల వద్ద స్టాక్ పాయింట్లను వంగలపూడి ఉపసర్పంచ్ కాండ్రేగుల ఫణి, స్థానికులు సూరెడ్డి మురళీకృష్ణ, సూరెడ్డి రామారావు, కొంచ బాబూరావు, సిరవరపు అప్పాజీ, కాండ్రేగుల పోశిరత్నంతో ఆయన పరిశీలించారు. ములకల్లంకలో ప్రజాభిప్రాయ సేకరణ గ్రామ సభకు అధికారులు వచ్చారనే సమాచారంతో అక్కడకు చేరుకుని ఆర్డీవో కృష్ణ నాయక్‌తో మాట్లాడారు. సభలో మాట్లాడడానికి అనుమతి ఇవ్వడంతో న్యాయవాది మాట్లాడుతూ వంగలపూడి, సింగవరం ర్యాంపుల వద్ద ఇసుక తవ్వకాలు అడ్డగోలుగా తవ్వుతున్నారన్నారు. 20 మీటర్లు లోతుగా తవ్వకాలు జరుపుతున్నారని తెలిపారు. రాత్రి సమయంలో ఇసుక రవాణా జరపరాదని, అయితే నిబంధనలను అతిక్రమించి, ఆ సమయంలో రవాణా చేస్తున్నారన్నారు. లారీపై వేసిన ఇసుక 45 టన్నులు ఉంటే, రికార్డులలో కేవలం 23 టన్నులు చూపిస్తున్నారని ఆరోపించారు. ఆర్ అండ్‌బీ రోడ్లపై 30 టన్నులకు మించి వాహనాలు వెళ్లరాదని, దానికి విరుద్ధంగా అధిక బరువు గల వాహనాలపై ఇసుక తరలిస్తున్నారన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో సరిహద్దులు లేకుండా ఇష్టానుసారం తవ్వకాలు జరుపుతున్నారని, సింగవరం రేవు నుంచి వెళ్లాల్సిన ఇసుక లారీలు వంగలపూడి ర్యాంపు నుంచి వెళ్లుతున్నాయన్నారు. దీనిపై ఆర్డీవో కృష్ణ నాయక్ స్పందించి తక్షణమే వంగలపూడి ర్యాంపు వద్ద చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ ఆదేశించారు. ఏదైనా అభ్యంతరం ఉంటే శాండ్ కమిటీకి తెలియపర్చాలని తహసీల్దార్‌కు సూచించారు. అనంతరం శివ కుమార్ తదితరులు వంగలపూడి ర్యాంపు చేరుకున్నారు. సాయంత్రం 6 గంటల తరువాత ఇసుక లారీలు వెళ్లడానికి అనుమతి లేదని, ఇసుక తవ్వే ప్రాంతంలో లారీలను అడ్డుకున్నారు. తహసీల్దార్‌తో వీఆర్వో మాట్లాడిన అనంతరం స్థానికుల నుంచి లిఖిత పూర్వకంగా లేఖ తీసుకుని లారీలను నిలిపివేశారు.

వర్షంతో ఉద్యాన పంటలకు ఊపిరి


ఈలకొలనులో సాగవుతున్న మొక్కజొన్న తోట

రంగంపేట: వేసవి ఉష్ణోగ్రతలతో సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న ఆరుతడి పంటలకు మూడు రోజులుగా కురుస్తున్న వర్షం ఊపిరి పోసింది. వర్షం ప్రభావంతో మెట్టప్రాంతం తడిసి ముద్దయ్యింది. దీంతో పంట పొలాలకు నీటి ఎద్దడి తొలగింది. ముఖ్యంగా కూరగాయలు, ఆకుకూరలు, అరటి, వంగ, బీర, ఆనబ, మిరప పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగు పనులకు కూడా ఉపయోగపడుతుందన్నారు. రంగంపేట, వడిశలేరు, కోటపాడు, సింగంపల్లి, మర్రిపూడి, నల్లమిల్లి, జి.దొంతమూరు, ఈలకొలను, ముకుందవరం తదితర గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న, బొప్పాయి, జామ, పామాయిల్, కొబ్బరి తదితర ఉద్యానవన పంటలు ఊపిరి పోసుకున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ వర్షం వల్ల మెట్ట ప్రాంత రైతులకు మేలు జరిగిందని ఉద్యానశాఖ అధికారి దివ్యశ్రీ తెలిపారు.

ఖరీఫ్‌కు రెడీ..

- పొలాలను సిద్ధం చేస్తున్న రైతులు
- దుక్కులు, విత్తనాల సేకరణలో బిజీ
- అనుకూలంగా మారిన వర్షాలు


నారు వేసేందుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

రాజానగరం: వేసవి అనంతరం తొలకరి వర్షాలు కురిసే వేళ ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు మెట్ట రైతులు సమాయత్తమవుతున్నారు. గడచిన వారం రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులతో అడపా దడపా కురుస్తున్న వర్షాలతో భూములను సాగుకు సిద్ధం చేసే పనులో పడ్డారు. ఇప్పటికే కొన్నిచోట్ల వేసవి దుక్కులు చేసిన పొలాలలో ఈ వర్షాలతో బహుళ ప్రయోజనాలు కలుగుతాయని చెబుతున్నారు. రబీ వరి కోతల అనంతరం పచ్చిరొట్టను సాగు చేసిన పొలాలతో పాటు ఖాళీగా ఉంచిన పొలాలలో కూడా ఈ వర్షాల సాయంతో దుక్కులు చేయడానికి అనుకూలత ఏర్పడింది. ఈ తరుణంలో బోర్లు ఉన్న రైతులు మరో అడుగు ముందుకు వేసి, నార్లు కట్టే పనులలో నిమగ్నమై బిజీగా మారారు.

విత్తనాల ఎంపికే ప్రధానం

సాగు ఏదైనా మంచి దిగుబడులు సాధించాలంటే ముందుగా విత్తనాల ఎంపికను అన్నదాతలు ప్రధాన ఘట్టంగా భావిస్తారు. ఖరీఫ్ సీజన్‌లో తుపానుల ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుంటాయి. ఈ క్రమంలో భారీ వర్షాలను, తుపానులను తట్టుకుని మంచి దిగుబడులు ఇచ్చే వరి వంగడాలను ఎంచుకోవాల్సిన అవసరం ఉంటుంది. అందుకు అనువైన రకాలను వ్యవసాయాధికారుల సూచనలతో పాటు సీనియర్ రైతుల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేసుకోవాలి.

విత్తన శుద్ధి తప్పనిసరి

ముందుగా ఎంపిక చేసిన విత్తనాల మొలక శాతాన్ని పరీక్షించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మొలక శాతం 80 శాతం పైబడి ఉంటేనే ఆయా విత్తనాలను తీసుకోవడం మంచిది. షాపుల్లో కొనుగోలు చేసినా, రైతుల నుంచి సేకరించినా మొలక శాతాన్ని పరీక్షించిన తర్వాతే విత్తనాలు తీసుకోవాలి. అనంతరం వాటికి విత్తన శుద్ధి చేయడం కూడా ఎంతో అవసరం. ఒక కిలో విత్తనానికి మూడు గ్రాములు కార్బండిజమ్‌ను కలిపి 24 గంటల తరువాత నారుమడిలో చల్లుకోవాలి. దీని వల్ల చీడపీడల నుంచి పంటను చాలావరకూ కాపాడుకునేందుకు అవకాశం ఉంటుంది.

నారు బాగా పెరగాలంటే..

విత్తనాలు చల్లడానికి ముందు నారుమడిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో దమ్ము చేసి, చదును చేయాలి. 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోలు చొప్పున చల్లాలి. ఈ సమయంలో జింకు లోపం ఉన్నట్టుగా గమనిస్తే దాని నివారణకుగా లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేటు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

విత్తనాల ఎంపికతోనే దిగుబడి



సీజన్ ఏదైనా మంచి దిగుబడులు సాధించాలంటే మంచి వంగడాలను ఎంపిక చేసుకోవడం ఎంతో ముఖ్యం. ఎంటీయూ 7029 (స్వర్ణ), ఎంటీయూ 1318 (పడిపోని స్వర్ణ), పీఎల్ 1100, సన్న రకాలలో ఎంటీయూ 1224, 1293 రకాలు మంచి దిగుబడులకు అనువైనవి. విత్తనాలను ఎంపిక చేసే సమయంలో మొలక శాతాన్ని పరిశీలించాలి. 80 నుంచి 85 శాతం వరకు మొలక శాతం ఉంటేనే ఆ విత్తనాలను కొనుగోలు చేయాలి.

– డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, శాస్త్రవేత్త, జిల్లా ఏరువాక కేంద్రం, దివాన్ చెరువు

క్లుప్తంగా

మామిడికాయలతో అలంకరణ


ప్రసన్నాంజనేయస్వామికి మామిడి కాయలతో చేసిన అలంకరణ

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని శనివారం మామిడి కాయలతో అలంకరించారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తుల హాజరై స్వామి వారికి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

నిరాశ్రయులకు అన్నదానం


పుష్కరఘాట్‌లో జరుగుతున్న అన్నదానం

రాజమహేంద్రవరం సిటీ: మృతుల జ్ఞాపకార్థం అన్నదానం చేయడం వల్ల వారి ఆత్మకు సద్గతులు ప్రాప్తిస్తాయని స్వర్ణాంధ్ర నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. స్థానిక పుష్కర ఘాట్‌లో శనివారం జరిగిన నిత్యాన్నదాన కార్యక్రమంలో కుడా ప్లానింగ్ ఆఫీసర్ చింతలపాటి సత్యనారాయణ రాజు ఆయన కుమారుడు కాశీరాజు జ్ఞాపకార్థం ప్రత్యేకంగా నిరాశ్రయులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రతి రోజూ సుమారు 250 మందికి భోజనం అందిస్తున్నామన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణ, బంధువులు

రాజమహేంద్రవరం రూరల్: త్వరలో జరగబోయే డీఎస్సీలో ఎస్‌జీటీ, ఎస్ఏ (గణితం) పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉపయోగపడేలా డైట్ సీనియర్ లెక్చరర్ కొమ్ముల వెంకట సూర్యనారాయణ షార్ట్ కట్స్ ఇన్ మేథమెటిక్స్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. దీన్ని శనివారం కుటుంబ సభ్యుల మధ్య తన మనవరాలు కియాన్ష చేతుల మీదుగా ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ గణిత సమస్యలను సులభంగా సాధించడానికి వీలుగా షార్ట్ కట్స్, సింపుల్ టెక్నిక్స్, మెమరీ టెక్నిక్స్‌తో ఉదాహరణల రూపంలో తెలియజేశానన్నారు. ఈ పుస్తక రచనలో ప్రోత్సహించిన డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇంటర్మీడియట్, డిగ్రీలో గణితాన్ని బోధించిన అమలాపురం ఎస్‌కేబీఆర్ కాలేజీ విశ్రాంత గణిత ఉపన్యాసకులు భమిడిపాటి కామశాస్త్రికి ఈ పుస్తకాన్ని అంకితచేశానన్నారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ప్రారంభం


వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సిటీ ఎమ్మెల్యే శ్రీనివాస్

సీటీఆర్ఐ: ఆర్అండ్‌బీ కంపోస్టు యార్డు సమీపంలోని ప్రజలు దశాబ్ద కాలంగా ఎదుర్కొంటున్న దుర్వాసన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. పేపర్ మిల్లు ఎదుట రోడ్డులోని డంపింగ్ యార్డులో రూ.5.72 కోట్లతో ఏర్పాటు చేసిన లెగసీ వ్యర్థాల నిర్వహణ (వేస్ట్ మేనేజ్‌మెంట్) ప్లాంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ఏర్పాటు ఆరు నెలల్లో పూర్తవుతుందన్నారు. కాకినాడ మాదిరిగానే రాజమండ్రిలో కూడా జిందాల్‌తో ఒప్పందం చేసుకుంటామని, ఇప్పటికే ప్రభుత్వంతో ఎంఓయూ అయ్యిందన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వనితను కలిసిన మార్గి లక్ష్మి


మాజీ మంత్రి వనితను పుష్పగుచ్ఛం అందజేస్తున్న మార్గి లక్ష్మి

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మార్గి లక్ష్మి శనివారం గోపాలపురంలో మాజీ మంత్రి, ఆ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తానేటి వనితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్గి లక్ష్మి మాట్లాడుతూ జగనన్న ఇచ్చిన తన పదవి ద్వారా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజాపక్షాన పార్టీ ఆశయాల మేరకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని చెప్పారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీ మార్గి నాగేశ్వరరావు ఉన్నారు.

రుణాలు చెల్లించని వారిపై కఠిన చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: ది ఏపీపీ మిల్స్ ఎంప్లాయీస్ మల్టీ పర్పస్ సహకార సంఘంలో రుణాలు తీసుకుని, చెల్లించకుండా ఉన్న విశ్రాంత ఉద్యోగులు, ప్రస్తుత ఉద్యోగులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం సహకార శాఖ అధికారులను ఆదేశించారు. రుణాలు తీసుకుని చెల్లించకుండా ఉన్న వారిపై కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. ఈ బకాయిల వసూలు ద్వారా సంఘంలో సొమ్ము దాచుకున్న డిపాజిటర్లకు త్వరగా చెల్లింపులు జరగడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ చర్యలు నిర్దేశిత కాలపరిమితితో పూర్తి చేయాలన్నారు. సంబంధిత బాకీదారులందరికీ ఆంధ్రప్రదేశ్ సహకార సంఘం చట్టం, 1964 ప్రకారం నోటీసులు తయారు చేసి వారం రోజుల్లోగా అందజేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అర్హతకు మించి రుణాలు పొందిన వారిపై లీగల్ చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు మానవత సమావేశం

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని మానవత స్వచ్ఛంద సేవాసంస్థ కార్యాలయంలో ఆదివారం ఉదయం 8.30 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు పాల కృష్ణ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ సమావేశంలో 2025– 26 సంవత్సరానికి నూతన కార్యవర్గం ఏర్పాటుపై సభ్యుల అభిప్రాయాలు తీసుకుంటామన్నారు. గత నెలలో జరిగిన కార్యక్రమాల వివరాలు, జూన్‌లో నిర్వహించే కార్యక్రమాలు, సభ్యుల సూచనలు, సలహాలు మొదలైన వాటిని చర్చిస్తామన్నారు. కావున మానవత సభ్యులందరూ ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి చింతాడ లావణ్య ఆదేశాల మేరకు రాజమండ్రి నార్త్ స్టేషన్ పరిధిలో శనివారం సీఐ అనుశ్రీ, ఎస్సై రాజేష్, సిబ్బంది విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడులలో తొర్రేడు గ్రామానికి చెందిన చిట్టాడ అనంతలక్ష్మిని అరెస్టు చేసి ఐదు లీటర్ల సారాను, సోమాలమ్మగుడి ప్రాంతంలో రెడ్డి హరిబాబును అరెస్టు చేసి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ అనుశ్రీ మాట్లాడుతూ సారా, అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. అలాంటివి జరిగితే టోల్ ఫ్రీనెంబరు 14405కు కాల్ చేసి చెప్పవచ్చన్నారు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

హెచ్ఐవీపై అవగాహన

రంగంపేట: మండల పరిధిలోని మర్రిపూడిలో శనివారం వీధి నాటకం ద్వారా హెచ్ఐవీపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు బుర్రకథ జయరాజు కళాజాతా బృందం ఈ కార్యక్రమం నిర్వహించింది. ఎయిడ్స్ వ్యాప్తి చెందే విధానం, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అదే విధంగా ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష, చిన్నచూపు లేకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ వేము మాధవి, చిరంజీవి, గ్రామ కార్యదర్శి ఎల్.త్రిమూర్తులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల :	శుభం
సూర్యమినీ :	ఫైనల్ డెస్టినేషన్
సూర్యప్యాలెస్ :	మిషన్ ఇంపాజిబుల్
స్వామి :	ఏస్
శివజ్యోతి :	హిట్-3
అనుశ్రీ :	ఫైనల్ డెస్టినేషన్
రాజా :	ఫైనల్ డెస్టినేషన్
ఊర్వశి :	నిశ్శబ్ద ప్రేమ
రంభ :	ఒక బృందావనం
మేనక :	వైభవం, ఎలెవన్
అప్సర :	సింగిల్
కుమారి :	వర్షం
అశోక :	కేసరి చాప్టర్-2
నామవరం	
వీఎస్ మహల్ :	ఏస్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	ఏస్, సింగిల్
కడియం	
వెంకటసూర్య :	ఫైనల్ డెస్టినేషన్